సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత



చెక్కులు అందజేస్తున్న జగదీశ్వర్ గౌడ్

శేరిలింగంపల్లి: నల్లగండ్లలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి వి.జగదీశ్వర్ గౌడ్ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ పేద ప్రజలు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. సీఎం సహాయ నిధి ద్వారా సహాయం అందజేస్తున్నారని వివరించారు. సందర్భంగా రూ.2.40 లక్షల విలువైన చెక్కులను అందజేశారు.

సీసీఆర్టీలో పెయింటింగ్ వర్క్‌షాప్



మాదాపూర్: మాదాపూర్‌లోని సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్సెస్ అండ్ ట్రైనింగ్ (సీసీఆర్టీ)లో హైదరాబాద్ రీజినల్ సెంటర్‌లో వికసిత్ భారత్ అంశంపై బుధవారం పెయింటింగ్ వర్క్‌షాప్ నిర్వహించారు. 18 పాఠశాలలకు చెందిన 350 మంది విద్యార్థులు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు. భారత్ వికాస్ పరిషత్ సహకారంతో ప్రధాన మంత్రి మోదీ అభివృద్ధి దృష్టి కోణానికి అనుగుణంగా నిర్వహించారు. విద్యార్థులు విజన్ ఫర్ ఇండియా పై భారత్ అనే అంశంపై తమ కలలు ఆశయాలను ప్రతిబింబించే చిత్రాలను రూపొందించారు. ఈ పోటీలో లోకేశ్ మొదటి బహుమతి, విశ్లావత్ అక్షయ రెండో స్థానం, సిరి మూడో స్థానంలో నిలిచారు. విద్యార్థులు తమ చిత్రాలను అధికారిక సేవా పర్వ్ పోర్టల్‌లలో అప్‌లోడ్ చేశారు. పోటీలో పాల్గొన్న విద్యార్థులకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో ముగిసిన ఛాప్ 2025

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో కొనసాగుతున్న ఛాప్ 2025 కార్యక్రమం బుధవారం ముగిసింది. వారం రోజులుగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉత్పత్తులను ప్రదర్శించిన కళాకారులకు అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర వాణిజ్య, ఐటీ రంగాల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, శిల్పారామం ప్రత్యేక అధికారి కిషన్‌రావు పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన కళాకారులను సత్కరించారు.

నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలి

శేరిలింగంపల్లి: సీసీరోడ్ల నిర్మాణంలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. బుధవారం ఆయన శేరిలింగంపల్లి డివిజన్‌లోని ప్రశాంతినగర్‌కాలనీలో సీసీరోడ్డు నిర్మాణ పనులను జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీసీ రోడ్లు పదికాలాలపాటు ఉండాలంటే నాణ్యత ఎంతో అవసరమన్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యత పాటిస్తూ త్వరిత గతిన ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. అంతర్గత రోడ్లన్నింటినీ దశలవారీగా సీసీరోడ్లుగా మారుస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీఈ ఆనంద్, ఏఈ భాస్కర్, జలమండలి మేనేజర్ అభిషేక్ రెడ్డి, నాయకులు రవీందర్‌గౌడ్, రాజ్‌కుమార్, అశోక్, సుభాష్, రాజేష్, కృష్ణ, రమేష్‌కుమార్, నర్సింహ్మ, పవన్ స్థానికులు పాల్గొన్నారు.

సాయిరాంనగర్ కాలనీలో హైడ్రా కూల్చివేతలు

అమినిటీ స్థలంలో ఏర్పాటు చేసిన గోశాల కూల్చివేత

- పార్కు, రోడ్డు ఆక్రమణల తొలగింపు
- గోశాల కూల్చివేతపై కాలనీ వాసులు, హిందూ ధార్మిక సంస్థల ఆగ్రహం



మియాపూర్: మియాపూర్ డివిజన్ పరిధిలోని సాయిరాంనగర్ కాలనీ(అభయాంజనేయ కాలనీ) పార్కు, అమినిటీ స్థలం రోడ్డు ఆక్రమణాలను హైడ్రా అధికారులు బుధవారం కూల్చివేశారు. సర్వే నంబర్ 202లోని సాయిరాంనగర్ కాలనీలో 30 ప్లాట్లు ఉన్నాయి. అందులో 3 పార్కులు, అమినిటీ స్థలం ఉంది. 330 గజాల్లో ఉన్న పార్కు స్థలంలో కొందరు ప్రహరీ నిర్మించి ఆక్రమించారని అదే విధంగా 318 గజాల అమినిటీ స్థలంలో పిండిగిర్నీ, గోశాల ఏర్పాటు చేశారని కాలనీ ఆసోసియేషన్ సభ్యులు హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో హైడ్రా అధికారులు గత కొన్ని రోజుల క్రితం కాలనీలో పర్యటించి పరిశీలించారు. పార్కు అమినిటీ స్థలంతో పాటు రోడ్డు ఆక్రమణకు గురైందని నిర్ధారించారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం హైడ్రా అధికారులు మియాపూర్ పోలీసుల బందోబస్తు మధ్య హైడ్రా ఇన్‌స్పెక్టర్ బాలగోపాల్ పర్యవేక్షణలో పార్కు ఆక్రమణలను తొలగించడంతో పాటు అమినిటీ స్థలంలో ఏర్పాటు చేసిన గోశాలతో పాటు రోడ్డు ఆక్రమణలను కూలిచ్చేశారు. అనంతరం పార్కు, అమినిటీ స్థలం చుట్టు కబ్జాకు గురికాకుండా హద్దులు ఏర్పాటుచేసి చుట్టు కంచే ఏర్పాటు చేసి బోర్డు పెట్టారు.



గోశాల కూల్చివేత...

మియాపూర్ సాయిరాంనగర్ కాలనీలో శ్రీ అభయాంజనేయస్వామి కాలనీ అమినిటీ స్థలంలో ఏర్పాటు చేసిన గోశాలను బుధవారం ఉదయం హైడ్రా అధికారులు కూల్చివేయడంపై కాలనీ వాసులు, హిందూ ధార్మిక సంస్థలు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో కాలనీలో ఉద్రిక్తత నెలకొంది. గత కొన్నేళ్లుగా కాలనీ వాసుల అనుమతితోనే అమినిటీ స్థలంలో గోశాలను ఏర్పాటు చేసి గోవులను సంరక్షిస్తున్నామని కాలనీ వాసులు పేర్కొన్నారు. అమినిటీ స్థలంలో కాలనీ వాసుల అనుమతితో ఏర్పాటు చేసిన గోశాలను నిబంధనలకు విరుద్ధంగా నిర్మించారని హైడ్రా అధికారులు కూల్చివేయడం దారుణమన్నారు. అభయాంజనేయ స్వామి ఆలయ ఆధ్వర్యంలో కాలనీ వాసులు ఏర్పాటు చేసిన గోశాలలో 15 గోవులు ఆశ్రయం పొందుతున్నాయి. ఒవైసీ సోదరులు చెరువులో కళాశాలను నిర్మించుకుని దందా చేస్తుంటే హైడ్రా కమిషనర్ ఏం చేయలేకపోతున్నారని, గోమాతలకు ఆశ్రయం కల్పిస్తున్న కేంద్రాలను కూల్చివేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా గోమాతలకు ప్రత్యామ్నాయ మార్గం చూపకుండా ఉన్న ఫలంగా ఖాళీ చేయించి గోశాలను కూల్చివేయడం అమానుషమన్నారు. దేవాలయం ఆధ్వర్యంలో కాలనీ వాసులు ఏర్పాటు చేసిన గోశాలను ఎలా కూలుస్తారని, 15 గోవులు రోడ్డున పడ్డాయని వాటి పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. హైడ్రా హిందూవుల ఆధ్యాత్మిక కేంద్రాలను టార్గెట్ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గోశాల విషయంలో హైడ్రా అధికారులు పునరాలోచించుకోవాలని కోరారు.

కాలనీలో రెండు గ్రూపులు..

మియాపూర్ సాయిరాంనగర్ కాలనీలో అభయాంజనేయ స్వామి దేవాలయం ఉండడంతో సాయిరాంనగర్ కాలనీ పేరుకు బదులుగా అభయాంజనేయ నగర్ కాలనీగా నామకరణం చేశారు. కాలనీలోని 318 గజాల అమినిటీ స్థలాన్ని ఆక్రమించి గోశాలను ఏర్పాటు చేశారని అక్కడే పిండిగిర్ని ఏర్పాటు చేయడంతో సౌండ్ పొల్యూషన్ ఏర్పడుతుందని కాలనీ అసోసియేషన్ సభ్యులు హైడ్రాకు ఫిర్యాదు చేయడంతో బుధవారం కూల్చివేతలు చేపట్టారు. మరో గ్రూపు సభ్యులు కాలనీ వాసుల అనుమతితోనే దేవాలయ ఆధ్వర్యంలో గోశాలను నిర్వహిస్తున్నామని, గోశాలను ముందస్తు సమాచారం లేకుండా ఎలా కూలుస్తారని మరో వర్గం సభ్యులు ప్రశ్నిస్తున్నారు. రెండు గ్రూపుల తగాదాలతో గోశాల కూలిపోయి గోవులు రోడ్డున పడ్డాయని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.





పోలీసు బందోబస్తు



నేడు ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసినట్లు ఎంఈఓ ఎస్.వెంకటయ్య తెలిపారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి మియాపూర్ జయప్రకాష్ నగర్ కమ్యూనిటీ హాల్‌లో గురువారం మధ్యాహ్నం సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పీఏసీ చైర్మన్ ఆరికెపూడి గాంధీ హాజరు కానున్నట్లు తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయులు వీరే....

శేరిలింగంపల్లి మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ధనలక్ష్మి (స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్), పి.శ్వేత (స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్) శేరిలింగంపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్, వంశీకృష్ణారావు (స్కూల్ అసిస్టెంట్ తెలుగు) మియాపూర్ జిల్లా పరిషత్ హైస్కూల్, సత్యనారాయణ గౌడ్ (స్కూల్ అసిస్టెంట్ తెలుగు) కొత్తగూడ జిల్లా పరిషత్ హైస్కూల్, టీవీ.మమత (స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్) రాయదుర్గం ఎంపికయ్యారు. ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయుల విభాగంలో భాగ్యరేఖ (మక్తా మహబూబ్‌పేట్), దత్తాత్రేయులు (మియాపూర్ వీకర్ సెక్షన్ కాలనీ) కాగా, సెకండరీ గ్రేడ్ టీచర్ విభాగంలో స్వరాజ్యలక్ష్మి (కొండాపూర్), శోభారాణి (గోపీనగర్), స్వాతి (వెంకటరమణ కాలనీ), మంజులాదేవి (రాయదుర్గం), దయానమ్మ (కేశవనగర్), రైసా ఫాతిమా (రాయదుర్గం ఉర్దూ మీడియం), మహాలక్ష్మీ (కొత్తగూడ), ఎల్ కె.లీలావతి (అంజయ్యనగర్), గీతారాణి (మార్తాండ నగర్) ఎంపికయ్యారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో ప్రయోజనం

పటాన్‌చెరు టౌన్: సీఎం సహాయనిధి ఆరోగ్య, ఆర్థిక భరోసా కల్పిస్తుందని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు. బుధవారం ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చిట్కుల్‌లో నియోజకవర్గానికి చెందిన పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఇస్నాపూర్ మున్సిపాలిటీకి చెందిన సుజాత, మంజుల, నవీన్, చిట్కుల్‌కు చెందిన మన్నే వెంకటేశ్, బొల్లారం మున్సిపాలిటీకి చెందిన రెడ్డి లక్ష్మణ్ రావు, గుమ్మడిదల మున్సిపాలిటీ చెందిన రాజమ్మలకు మొత్తం రూ. మూడు లక్షల 25 వేల విలువ గల చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో ఇస్నాపూర్ మాజీ ఎంపీటీసీ గడ్డం శ్రీశైలం, బొల్లారం మాజీ కౌన్సిలర్ సుజాత, దానయ్య, ముత్తంగి అశోక్ పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీకి వినతి పత్రం అందజేస్తున్న సుభాష్ చంద్రబోస్ కాలనీ వాసులు

చందానగర్: మాదాపూర్ డివిజన్ పరిధిలోని సుభాష్ చంద్రబోస్ నగర్‌లో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై బుధవారం కాలనీ వాసులు పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ కాలనీలో మౌలిక వసతులు కల్పించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. కాలనీలో అసంపూర్తిగా మిగిలిన రోడ్ల పనులను పూర్తి చేయాలని కోరామన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలోనే కాలనీలో పర్యటించి సమస్యలను పరిశీలిస్తానన్నారు. అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేస్తామన్నారు. డ్రైనేజీ, మంచినీటి వ్యవస్థను మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, సాంబశివ రావు, అంకారావు, అబ్దుల్ రహమాన్, రాములు యాదవ్, సత్యం, భుజంగం, అప్పలరాజు, ముక్తార్, నర్సింహ, కృష్ణ యాదవ్, రవి, భాస్కర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

మియాపూర్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని పర్యావరణ పరిరక్షణ కమిటీ చైర్మన్ లయన్ అన్యంకోటి రెడ్డి అన్నారు. బుధవారం మియాపూర్ డివిజన్, మయూరినగర్ కాలనీలో కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ.. నగరంలో పెరిగిపోతున్న కాలుష్య నియంత్రణ కోసం స్వచ్ఛమైన గాలి కోసం ప్రతి ఒక్కరూ కనీసం ఒక్క మొక్క నాటి ప్రకృతిని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. మొక్కలు నాటడంతో పాటు వాటి పరిరక్షణ బాధ్యత కూడా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మయూరినగర్ ప్రెసిడెంట్ రామరాజు, సెక్రటరీ కిషోర్ కుమార్, వెంకట్ రావు, రమేష్, ఆదినారాయణ, రత్తయ్య, లయన్ వెంకట్ రెడ్డి, అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



మయూరినగర్ కాలనీలో మొక్కలు నాటుతున్న అన్యంకోటి రెడ్డి తదితరులు

మాటల్లో పెట్టి బ్రాస్‌లెట్ చోరీ

ఇద్దరు నిందితుల అరెస్ట్

గచ్చిబౌలి: తన ఆఫీసు ఎదుట నిలబడి ఉన్న ఓ ఐటీ ఉద్యోగిని మాటల్లో పెట్టి అతడి చేతికి ఉన్న బ్రాస్‌లెట్‌ను చోరీ చేసిన కేసులో ఇద్దరు నిందితులను మాదాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. మాదాపూర్ ఏసీపీ సీహెచ్.శ్రీధర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 15న మధ్యాహ్నం ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని ఆమెజాన్ గేట్ నెంబర్ 5 ఎదుట క్యాబ్ కోసం ఐటీ ఉద్యోగిని రేలాగౌడ్ నిరీక్షిస్తోంది. అదే సమయంలో స్కూటీపై వచ్చిన ఇద్దరు యువకులు అమెజాన్ కంపెనీలో ఉద్యోగం ఎలా పొందాలని, ఉద్యోగం ఎలా ఉంటుందని ఆమెను మాటల్లో పెట్టి ఆమె చేతికి ఉన్న బ్రాస్‌లెట్‌ను లాక్కుని స్కూటీపై ఉడాయించారు. దీంతో బాధితురాలు డయల్ 100కు కాల్ చేసి ఫిర్యాదు చేసింది. అప్రమత్తమైన గచ్చిబౌలి పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితులను ఈవెంట్ మేనేజ్‌మెంట్‌లో పని చేసే మలక్‌పేట్‌కు చెందిన చిక్కుల నరేందర్, అతని స్నేహితుడు పెట్ గ్రూమింగ్ చేసే అన్నవరం అశీష్‌కుమార్‌గా గుర్తించిన పోలీసులు వారిని అరెస్టు చేశారు. నిందితుల నుంచి 6 గ్రాముల బంగారు బ్రాస్‌లెట్, రెండు సెల్ ఫోన్లు, స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. అశీష్ కుమార్ తనకు రూ.8 వేలు డబ్బులు కావాలని అడగడంతో స్నాచింగ్ చేసేందుకు స్కెచ్ వేశారని, మొదటి ప్రయత్నంలోనే పట్టుబడినట్లు పోలీసులు తెలిపారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్ హబీబుల్లాఖాన్, డీఐ నరేష్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



శేరిలింగంపల్లిలో భారీ వర్షం

- రహదారులను ముంచెత్తిన వరద నీరు
- వాహనదారుల అవస్థలు

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలో భారీ వర్షం కురిసింది. బుధవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ఏకధాటిగా కురిసిన వర్షానికి జనజీవనం అస్తవ్యస్తమైంది. పలు ప్రధాన రోడ్లపైకి భారీగా వరదనీరు చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మియాపూర్-చందానగర్, మాదాపూర్-బయోడైవర్సిటీ పార్కు రోడ్డులో ట్రాఫిక్ ను నియంత్రించేందుకు పోలీసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



లింగంపల్లిలో వర్షం కురుస్తున్న దృశ్యం



విద్యార్థులు ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలి

రాయదుర్గం: విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితేనే ఉన్నత స్థానాల్లో ఉంటారని 'ఎస్కీ' డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వర్‌రావు అన్నారు. బుధవారం గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా లోని స్కూల్ ఆఫ్ పోస్టు గ్రాడ్యుయేట్ స్టడీస్‌లో పీజీ డిప్లొమో ఇన్ జనరల్ మేనేజ్‌మెంట్, పీజీ డిప్లొమో ఇన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మేనేజ్‌మెంట్ విద్యార్థులకు మోటివేషన్ క్లాసులను ప్రారంభించారు. ఈ సందర్భంగా రామేశ్వర్ రావు మాట్లాడుతూ 'ఎస్కీ' క్యాంపస్‌లో 2008లో ప్రారంభించిన స్కూల్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టడీస్ ద్వారా వందలాది మంది విద్యార్థులు జీవితాలు బాగుపడ్డాయన్నారు. ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ గుర్తింపుతో మంచి ఉద్యోగాల్లో స్థిరపడ్డారని, ఎస్కీలో మేనేజ్‌మెంట్ సంబంధించిన పలు కోర్సులలో కూడా నిపుణులైన ఫ్యాకల్టీలు ఉన్నారని, విద్యార్థులు వీరి సేవలను వినియోగించుకోవాలన్నారు. ఒడిశాలోని గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ టెక్నాలజీ ప్రొఫెసర్ వి కృష్ణకుమార్ మాట్లాడుతూ సీతాకోక చిలుకను ఆదర్శంగా తీసుకుని వివిధ స్థాయిల్లో కష్టపడితేనే జీవితంలో రాణించి పదిమందికి ఉపయోగపడుతారన్నారు. యూజీసీ నేషనల్ సెక్యూరిటీ స్టడీస్ ఎక్స్‌పర్ట్ కమిటీ చైర్మన్ డాక్టర్ రమేష్ కన్నెగంటి మాట్లాడుతూ జీవితంలో క్రమశిక్షణ మాత్రమే మనిషిని ఉన్నత స్థానంలో నిలబెడుతుందన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఐఎఫ్‌ఎస్ అధికారి ఎంసిపార్గిన్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె అశోక్, డాక్టర్ ఆర్ వెంకట్‌రెడ్డి, విద్యాసాగర్, డాక్టర్ యూఎస్‌జ్యోతి, అనితా అగర్వాల్, సాయికిషోర్, సయ్యద్ అజ్గర్, డాక్టర్ సాగర్, రామకిషోర్, డాక్టర్ సింధు మెండ, అలిగ రాజు, డాక్టర్ రాజేశ్వరి, రమావత్‌కిషన్, మురళిదాసరి తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని పుట్టిన రోజు సందర్భంగా రక్తదాన శిబిరం

మియాపూర్: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ 75వ పుట్టిన రోజు సందర్భంగా మియాపూర్‌లోని ఆర్‌బీఆర్ కాంప్లెక్స్ వద్ద అఖిల భారతీయ తెరాపంత్ యువక్ పరిషత్ శాఖ, రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు రాధాకృష్ణ యాదవ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవి కుమార్ యాదవ్ ప్రారంభించారు. నాయకులు, కార్యకర్తలతో కలిసి నరేంద్రమోదీ జన్మదిన వేడుకలను నిర్వహించారు. పెద్ద సంఖ్యలో అభిమానులు, నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రవి కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని, రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. కార్యక్రమంలో నాయకులు అభిషేక్, సుమన్, విశాల్, సుబాష్, విమల్, రాహుల్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తెలంగాణ విమోచన దినోత్సవం



గచ్చిబౌలి అగ్నిమాపక కేంద్రంలో..



అంజయ్యనగర్, బంజారాబస్తీలో..

గచ్చిబౌలి/రాయదుర్గం: తెలంగాణ విమోచనా దినోత్సవం, ప్రజాపాలనా దినోత్సవాన్ని డివిజన్ పరిధిలో ఘనంగా నిర్వహించారు. బుధవారం గచ్చిబౌలిలోని అగ్నిమాపక కేంద్రంలో ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ నారాయణరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

- గచ్చిబౌలిలోని 'నిథమ్' క్యాంపస్‌లో డైరెక్టర్ ప్రొఫెసర్ వి వెంకటరమణ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో నిథమ్ ప్రిన్సిపల్ డాక్టర్ గణేష్, అధికారులు, ఫ్యాకల్టీ ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.
- కొండాపూర్‌లోని అంజయ్యనగర్ ,బంజారాబస్తీలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవికుమార్‌యాదవ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ, బీజేవైఎం, వివిధ మోర్చాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.
- రాయదుర్గంలోని వార్డు కార్యాలయంలో బీజేపీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు తెలంగాణ విమోచనా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు.



భెల్ ఎంఐజీ కాలనీలో ..



నిథమ్ క్యాంపస్‌లో..



రాయదుర్గంలో..



శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో..